క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని కొండమోడు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎం. సైదరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండమోడు నుంచి రసూల్‌పేట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



విజయపురిసౌత్: తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం, ఆరోగ్యమని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. మాచర్ల మండలం చింతలతండాలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో బుధవారం జరిగిన తల్లి పాల వారోత్సవాలలో వారు మాట్లాడారు. తల్లిపాలలో మాంసకృతులు, విటమిన్లు, కాల్షియం, ఖనిజలవణాలు పుష్కలంగా అభిస్తాయని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు మొదటిరోజే పట్టించాలని చెప్పారు. ఆరు నెలల పాటు తల్లిపాలు ఏడో నెల నుంచి పాలతో పాటు అనుబంధ పోషకాహారం రోజుకి ఎన్ని సార్లు ఇవ్వాలో గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జె.వి. మహాలక్ష్మి, ఎం. శారద, పి. రూపాదేవి, కె. అఖిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

క్రోసూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా శివనాగమల్లేశ్వరరావు



క్రోసూరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడిగా జనసేన నాయకుడు కడియం శివనాగమల్లేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పాల్గొని సొసైటీ అధ్యక్షుడు, పాలక వర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన చైర్మన్ పాలకవర్గం సొసైటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యర్రం రామకృష్ణ, వెన్నా సాంబ శివారెడ్డి, కంచేటి సాయిబాబు, నలజాల కోటేశ్వరరావు, శాఖమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం



నకరికల్లు: ఏటీఎం మోడల్‌లో పంటలను సాగు చేయడం ద్వారా రోజువారి ఆదాయాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా నకరికల్లు, కారంపూడి వీపీఏలకు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం సందర్శించి సాగు విధానాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఏటీఎం విధానంలో 15 నుంచి 20 రకాల తీగ, దుంపజాతి, ఆకు కూరలు, కూరగాయలు వేయాలన్నారు. సాగు ప్రారంభించిన 15 నుంచి 20 రోజుల నుంచే ఆదాయం మొదలవుతుందన్నారు. కనీసం 20 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్‌లో సాగుచేసి నిరంతర ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలకు వినియోగించే ద్రవ, ఘన జీవామృతాలు, బీజామృతం, నీమాస్త్రం తయారు చేయడం, వాడే విధానాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జిలు రామసుబ్బారెడ్డి, జ్యోతి, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి: జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల ప్రకారం ఈ నెల 13న మండల న్యాయ సేవా కమిటీ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సివిల్ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రెవెన్యూ కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవాలని విజయ్ కుమార్‌రెడ్డి కోరారు.

‘దుర్గి’తి నుంచి మోక్షమెప్పుడో ?

- దుర్గి పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా
- కానరాని అభివృద్ధి
- కనీస మౌలిక వసతులు కరువు
- చెంతనే కృష్ణ నీరున్నా నిత్యం తాగునీటికి ఇక్కట్లు



మట్టి రోడ్డును తలపిస్తున్న దుర్గి ప్రధాన రహదారి

దుర్గి: ఎంతో చరిత్ర కలిగిన నాటి దుగ్య పట్టణం నేడు దుర్గిగా అవతరించింది. ప్రస్తుతం ఊరు గొప్ప.. ఊరు దిబ్బగా చందంగా మారింది. మండల కేంద్రమైన దుర్గి పట్టణానికి పరిసర గ్రామాల నుంచి పలువురు వలస వచ్చి ఇక్కడే స్థిర నివాసమేర్పచుకొని జీవనం కొనసాగిస్తున్నారు. కానీ దానికి తగ్గ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 8,590 మంది నివసిస్తున్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య 15,000 వరకు ఉండొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 3వేలకు పైగా గృహాలు సముదాయం ఉన్నాయి.

గుక్కెడు నీరు కరువు

నిత్యావసరమైన తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు మినహా కొత్తగా నిర్మించుకున్న దాఖలాలు లేవు. రోజురోజుకీ జనాభా పెరగడంతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. భూగర్భంలో ఉన్న నీటి నిల్వలు తరిగిపోతున్నాయి. చెంతనే కృష్ణానది ఉన్నా తాగునీటి తిప్పలు తప్పడం లేదు.

మట్టి రోడ్లతో నరకయాతన

పట్టణంలో మట్టి రోడ్లు ఇంకా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీ, ముటుకూరు రోడ్డు, వినుకొండ



అంతర్గత రోడ్డు దుస్థితి

రోడ్డు, ఎస్సీ కాలనీ, పోతురాజు గడ్డ, జంగాల కాలనీలలో మట్టిరోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత వర్షా కాలంలో రాకపోకలు సాగించాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండాకాలమైతే ఇళ్లలోకి దుమ్ము వస్తోంది. కొన్ని చోట్ల గుంతలు పడటంతో రాత్రిళ్లు వాహనదారులు కిందపడి గాయపడిన సందర్భాలు అనేకం. మట్టి రోడ్లతో ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్రా‘ఫికర్’తో పాట్లు

పట్టణంలో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉన్నారు. వారిలో చాలా మందికి ట్రాఫిక్ నిబంధనలు తెలియవు. పోలీసు అధికారులు కూడా వారిలో చైతన్యం కల్పించకుండా నిర్లిప్తతతో వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై తోపుడు, బండ్లు, గంపలతో చిన్న చిన్న వ్యాపారాలు తిష్ట వేయడంతో ఇబ్బందిగా ఉంటుంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కొందరు దుర్గికి వచ్చి వెళ్ళేవారు రోడ్డు పైనే కార్లు, పెద్ద వాహనాలు ఉంచటంతో ట్రాఫిక్ సమస్య మరింతగా ఉంటోంది. ముటుకూరు రోడ్డు మూలమలుపు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ పక్కన భారీ వాహనాలు పార్కింగ్ చేయటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పోలీసులు పట్టించుకోకపోవటం, వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు.

పెరిగిపోతున్న భూముల ధరలు

దుర్గి పట్టణ చుట్టు పక్కల రియల్టర్లు లే అవుట్లు వేసి, మౌలిక వసతులు కల్పించకుండానే ప్లాట్లను అమ్ముతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు హైదరాబాద్, విదేశాల్లో స్థిరపడిన స్థానికులు ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ముటుకూరు మూల మలుపు వద్ద సెంటు భూమి రూ. 15లక్షల వరకూ పలుకుతోంది. దుర్గి నుంచి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఎకరం రూ. 70లక్షల నుంచి రూ. కోటి వరకు ఉంది. పలు కాలనీలలో సెంటు సుమారుగా రూ. 5లక్షల వరకు పలకడం జనాభా పెరుగుదలకు ఉదాహరణగా నిలుస్తోంది. శరవేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణమ్మ చెంత నీటి కష్టాలు



పట్టణంలో వేలాది మంది ప్రజలకు నిత్యం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బుగ్గడ్యాం అందుబాటులో ఉన్నా నూతనంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించకపోవటంతో మంచినీటికి ఇబ్బంది పడుతున్నారు. సరైన ప్రణాళికలు రూపొందించి, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి ప్రజల సమస్యలు పరిష్కరించే అధికారులే కరువయ్యారు.

– తోటకూర వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు

అణగారిన వర్గాల కోసం జీవితం త్యాగం చేసిన గద్దర్



సత్తెనపల్లి: ఆదివాసీల హక్కులు, రైతు కూలీలు, దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన గళాన్ని పాటల రూపంలో వినిపించి జీవితం త్యాగం చేసిన మహనీయుడు గద్దర్ అని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్, దళిత మహాసభ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్ఞాన్‌రాజ్ పాల్ మాట్లాడుతూ గద్దర్ బ్యాంకు ఉద్యోగాన్ని కూడా వదిలేసి, పేద ప్రజల కోసం దండకారణ్యంలో, మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల హక్కుల కోసం పోటు పడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఇదే క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా చుండూరు గ్రామంలో 34 సంవత్సరాల క్రితం అగ్రవర్ణ భూస్వాముల అమానుషమైన దాడిలో చనిపోయిన ఎనిమిది మంది దళితుల ఆత్మకు శాంతి చేకూరాలని, చుండూరు కేసులో దోషులైన అగ్రవర్ణ భూస్వాములకు, ఏ విధమైన శిక్షలు విధించకుండా న్యాయాన్ని అపహాస్యం చేశారన్నారు. చుండూరు దోషులకు శిక్ష పడేవిధంగా దళిత మహాసభ, కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ, పీసీసీ కార్యదర్శి మాధంశెట్టి వేదాద్రి, అంబేడ్కర్ యువ జన సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల పాల్‌రాజు, నాయకులు పోతల సంగీతరావు, షేక్ హైదర్ ఆలీ, షేక్ మస్తాన్‌వలి, కోటపాటి సాంబశివరావు, సిద్దెల మోహన్‌రావు, మంగళపూరి శంకర్ ఉన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

నూజెండ్ల: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోనిఅయినోలు,దాట్లవారిపాలెం (రెడ్డి పాలెం) గ్రామాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు గ్రామాల్లో అనధికారకంగా మద్యం సీసాలను అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని తెలిపారు. అయినోలు గ్రామానికి చెందిన రేవళ్ళ కిరణ్ కుమార్, దాట్లవారిపాలెం గ్రామానికి మక్కెళ్ళ ఏడుకొండలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇద్దరు దగ్గర నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై వినీల, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పోరాటం



నూతన కమిటీతో జిల్లా కన్వీనర్ సాయికుమార్

పిడుగురాళ్ల: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కోసం అనేక ఉద్యమాలు చేసినట్లు చెప్పారు. పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం నిర్మించాలని, పది సెంట్ల స్థలం కేటాయింపునకు ఎన్నో వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దొంగ జీవోలతో విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలను వెళ్లనీయకుండా, విద్యార్థుల సమస్యలు చెప్పుకోకుండా అడ్డుకుంటోందని తెలిపారు. సమావేశాల అనంతరం మండల విద్యార్థుల హక్కులను హరించే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కడియం రోహిత్, అల్తాఫ్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా యాసిన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకూరపాడు జెడ్పీ పాఠశాలలో హిరోషిమా డే



ప్లకార్డులతో విద్యార్థులు

పెదకూరపాడు: యుద్ధాలు మానవ వినాశకాలని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ అన్నారు. బుధవారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో హిరోషిమా డే సందర్భంగా యుద్ధాలు వలన కలిగే వినాశనాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు, కొవ్వొత్తులతో యుద్ధం వద్దు... శాంతి ముద్దు, అణ్వాస్త్రాల కన్నా... అన్నవస్త్రాలే మిన్న అంటూ ర్యాలీ చేశారు. రెండవ ప్రపంచ యుద్ధంలో మృతి చెందిన లక్షలాది మందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణ మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో 1945 ఆగస్టు 6వ తేదీన జపాన్‌లో హిరోషిమా నగరంపై అమెరికా అణుబాంబు ప్రయోగించిందని అందులో జపాన్ పౌరులు లక్షలాది మంది మృతి చెందారని గుర్తు చేశారు. యుద్ధాలు మానవ వినాశనానికి మూలమన్నారు. మానవ చరిత్రలో ఒక దుర్దినమన్నారు. విద్యార్థి దశ నుంచే యుద్ధాల వలన కలిగే వినాశనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడి పందెల స్థావరంపై దాడి

యడ్లపాడు: కోడి పందేల స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ శివారులో చట్టవిరుద్ధంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారని, బహిరంగంగానే కొనసాగుతున్న ఈ పందేల్లో భారీగా డబ్బు పందెంలో కాస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ టి.శివరామకృష్ణ, సిబ్బందితో కలిసి బుధవారం పందెం నిర్వహించే స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుంచి రూ.3,150 నగదుతో పాటు, ఒక మృతి చెందిన కోడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు !



సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదకూరపాడు: పనిచేయని ఫోన్లు మాకొద్దని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం బెల్లంకొండ మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు మండలంలోని 75త్యాళ్లూరులో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేశారు. సీడీపీవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో అందించారు. అనంతరం ఆ బృంద ప్రతినిధులు మాట్లాడుతూ లబ్ధిదారుల ఫొటోలు తీయాలన్నా ఫోన్లు పనిచేయడం లేదని, ఒకటికి నాలుగు సార్లు ఫొటో తీయవలసి వస్తుందన్నారు. పాత టెక్నాలజీ ఉండటంతో ఉపయోగపడటం లేదని, వెంటనే అధునాతన ఫోన్లు ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ కూడా అంగన్వాడీ కార్యకర్తలు ఎప్పుడు ఉద్యోగ విరమణ చేస్తే అప్పుడు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగస్తుల పేరుతో తల్లికి వందనం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఖాతాలలో జమ కాలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగులమన్న నెపంతో తెల్ల రేషన్ కార్డులు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూరిబాబు, యూనియన్ ప్రతినిధులు విజయలక్ష్మి, శోభ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరుతో బినామీలకు చెక్

డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్



మాట్లాడుతున్న డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులందరికీ ముఖ ఆధారిత హాజరు తీసుకొని రెండు పూటలా వారిచే పని చేయించాలని నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం సిబ్బందికి బుధవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా హీరాలాల్ నాయక్ మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరుతో బినామీలను అరికట్టవచ్చన్నారు. ఉపాధి కూలీలు రెండు పూటలా హాజరును యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా జియో ఫెన్సింగ్, జియో ట్యాగింగ్, ఈఎంఎంఎస్, హార్టికల్చర్, రికార్డుల నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. శిక్షణలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ పి.వెంకటనారాయణ, ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, రిసోర్స్ పర్సన్ వెంకటస్వామి, హరిత, రాజవర్ధన్, రమణమూర్తి, ఈసీలు, జేఈఈలు, టీఏలు, బీఎఫ్‌టీలు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు లీకులు.. వృథాగా తాగునీరు



గుండ్లపల్లిలో పైపులైన్ పగలడంతో వృథాగా పోతున్న తాగునీరు

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పైపులు ధ్వంసం కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. తాగునీరంతా డ్రైనేజీలో కలసి పారుతోంది. గ్రామంలోని ప్రధాన వీధిలో ఇటీవల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో గోతులు తవ్వడంతో తాగునీటి పైపులైన్‌లు ధ్వంసమయ్యాయి. గ్రామంలోని మంచినీటి చెరువు నుంచి తాగునీటి సరఫరా చేసే పైపుల నుంచి వచ్చేనీరు డ్రైనేజీలో కలుస్తోంది. దీంతో పలు వీధుల్లో తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పగిలిపోయిన పైపులైన్‌లకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

రమేష్ యాదవ్‌పై దాడి దుర్మార్గం

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గాంధీ



పిడుగురాళ్లలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గురజాల: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమని పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, దీనికి నిదర్శనం పులివెందుల సంఘటనేనని తెలిపారు. సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని, వారి అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. టీడీపీ నాయకుల ఆగడాలు హెచ్చుమీరుతున్నారని, అన్ని రోజులు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండదని గుర్తు చేశారు. నెల్లూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన చేస్తుంటే కూటమి నాయకుల్లో దిగులు పట్టుకుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రోడ్డుపై గుంతలు తీయడం, బారికేడ్‌లు ఏర్పాటు చేయడం చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కూటమి నాయకులు అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడతారని ఆయన చెప్పారు. జగన్ పర్యటన చేస్తే కూటమి నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. స్వచ్ఛందంగా నాయకులు, కార్యకర్తలు తరలివస్తుంటే కూటమి నాయకులు ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వి. అమరారెడ్డి, మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పట్టణ కన్వీనర్ కె. అన్నారావు, వేముల చలమయ్య, దేవండ్ల నారాయణ, మన్నెం ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాంధీ తదితరులు

రమేష్ యాదవ్‌పై దాడి సరికాదు

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి సరైనది కాదని పిడుగురాళ్ల పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే ప్రజాస్వామ్యం నడుస్తుందా.. లేదా? అనే అనుమానం ప్రజాస్వామ్యవాదులకు వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు, అబద్ధాలు చెప్పి, మోసం చేసి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న వారిని హింస ద్వారా అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. అధికారం ఉందని వ్యవస్థలను చేతులో పెట్టుకొని ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని తెలిపారు. ఖాళీగా అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తారు గానీ ఇప్పుడు కొన్నింటికి మాత్రమే నిర్వహించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాయోపాయాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకోవాలని చూస్తోందని, కానీ బీసీలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు శెట్టుపల్లి పూర్ణ, కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఇంగ్లిష్ మీడియం పరిరక్షణ వేదిక దాదినబోయిన ఏడుకొండలు, మాజీ మండలాధ్యక్షులు గండికోట కోటేశ్వరరావు, పోచమల్ల కొండలు, ఇల్లూరి వెంకయ్య, కందులూరి శివయ్య, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా సెక్రటరీ అంకారావు, అబ్దుల్ కలాం ఆశయ సాధన సమితి రాష్ట్ర నాయకులు కాపర్తి మహమ్మద్ నూర్, కానాల అప్పారావు, దేవల నాగరాజు, బండారు అంజిబాబు, గోగుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై దాడులు

బొల్లాపల్లి: మండలంలో పలు రేషన్ షాపులపై సివిల్ సప్లై అధికారులు బుధవారం దాడులు–నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు బృందం వెల్లటూరు, వడ్డంగుంట, గుమ్మనంపాడు గ్రామాల్లో షాపులను తనిఖీ చేసింది. గత వారం రోజుల్లో రేషన్ షాపులపై దాడులు చేయడం ఇది రెండోసారి అని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సానుభూతిపరులకు చెందిన షాపులపై మాత్రమే అధికారులు ఈ దాడులకు పాల్పడుతున్నారని డీలర్ల నుంచి ఆరోపణనిపిస్తున్నాయి.

యాపిల్ లోడ్ మినీలారీ బోల్తా

యడ్లపాడు: వేగంగా వెళ్తున్న యాపిల్‌లోడ్ మినీలారీ పల్టీ కొట్టింది. మండలంలోని తిమ్మాపురం బైపాస్ రహదారిపై వెళ్తున్న టాటా ఆప్పీ ఆటో మలుపు వద్ద బుధవారం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం కొంత ధ్వంసం కావడంతో పాటు యాపిల్ బాక్సుకు కొన్ని రోడ్డుపై పడి దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.